26-11-99

# పాకిస్తాన్ మీద వేయడానికి ఏ రాయి అయితేనేం?

**పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యమొక అలవాటుగా మారకపోవడం విచారకరమే. ఆ దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరకాలంటే ప్రజాస్వామ్యం బలపడడం అవసరం. ఆ లేమిని భారత రాజ్యం ప్రయోజనాలకోసం పాకిస్తాన్ 'ఇమేజ్'ను దెబ్బతీయడానికి వాడుకునే వైఖరి విడిచిపెట్టి, దానిని మనతోటి వారయిన పాకిస్తానీల సమస్యగా అర్థం చేసుకుని ఆ దేశంలో ప్రజాస్వామ్యం మెరుగుపడడానికి మనమేదైనా కృషి చేయగలిగితే చేద్దాం.**



కె.బాలగోపాల్

దర్బన్‌లో జరిగిన కామన్‌వెల్త్ సమావేశంలో భారత ప్రధానమంత్రి వ్యవహరించిన తీరు భారతీయ జనతా పార్టీని ప్రగాఢంగా అభిమానించే వారిని మినహాయించి తక్కిన వారందరికీ ఎంతో కొంత ఎబ్బెట్టుగా తోచకతప్పదు.

నేనంటున్నది పాకిస్తాన్ బహిష్కరణ విషయాన్ని గురించి. నిజమే, సైనిక పాలనలోకి పోయిన సభ్యదేశాలపైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి ఒత్తిడి పెట్టడానికి బహిష్కరణ వంటి చర్యలు చేపట్టవచ్చునని కామన్‌వెల్త్ నియమాలలో ఉంది. కానీ దానిని ప్రయోగించే విషయంలో భారత ప్రభుత్వం ప్రదర్శించిన ఉత్సాహమే అభ్యంతరకరంగా ఉంది. ఈ ఉత్సాహానికి కారణం పాకిస్తానీల మీద ప్రేమ కాదు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగడం వారికి మేలన్న సానుభూతికాదు. అసలు మన పాలకులు పాకిస్తానీ రాజ్యాన్ని గురించే తప్ప ప్రజల గురించి ఆలోచించిన దాఖలాలేవీ లేవు. ఎప్పుడూ కనబడలేదు కాబట్టి పాకిస్తానీ ప్రజల మీద ప్రేమతో కామన్వెల్త్ సమావేశంలో ఆదేశ ప్రభుత్వాన్ని అల్లరిపెట్టారని నమ్మలేము.

పాకిస్తాన్‌ను రాజకీయంగా ఇబ్బందిపెట్టడానికి ఏ సాధనమైనా సరేననేది మన పాలకుల అభిప్రాయం. ఇదే 'భారతీయ సంస్కృతి' అయినట్టయితే దాని గొప్పదనాన్ని ప్రచారం చేసుకోవడం ఎందుకు? 1975 లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలన విధించినప్పుడు ఏ అంతర్జాతీయ వేదిక నుండయినా భారత్‌ను బహిష్కరించాలని ఏదేశమైనా ఒత్తిడిపెడితే మనమేమని ఉందుము? ప్రభుత్వం చేసిన తప్పిదానికి ప్రజలందరికీ నష్టం కలిగించే శిక్ష విధించవద్దని, ఒక క్లిష్ట సమయంలో దేశాన్ని వెలివేయడం సరైనదికాదనీ అని ఉందుము. కామన్‌వెల్త్‌లో ఉండడం వల్ల ఏమొస్తుందనేది ఇక్కడ ప్రశ్నకాదు. అదొక అలంకారప్రాయమైన వేదికే కావచ్చు. కానీ దాని నుండి పాకిస్తాన్‌ను వెలివేసి ఎవరిని ఉద్ధరించాలనుకుంటున్నామనేది ప్రశ్న.

పాకిస్తానీ ప్రజలను ఆదేశ ప్రభుత్వం నుంచి, రాజ్యం నుంచి వేరుచేసి చూసే అలవాటు మనలో ఎవ్వరికీ లేదు గానీ ఉండి ఉంటే ఈ చర్యను పర్వేజ్ ముషర్రాఫ్ మాత్రమే కాదు, పాకిస్తానీలందరూ తమను అవమానపరిచే చర్యగా భావిస్తారని గ్రహించి ఉందుము. 'మా కష్టాలేవో మేము పడతాము, వీళ్లెవ్వరూ మమ్మల్ని శాసించడానికి?' అనుకుంటారు.

కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ మనపైన పెడుతున్న అభియోగంలో నైతికబలం ఉంది కాబట్టి, దానికి చెప్పగల జవాబేదీ మన దగ్గరలేదు కాబట్టి, ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ పాకిస్తాన్ నైతిక అర్హతను కించపరచడం మన విదేశీ విధానంలో ఒక ముఖ్య అంశంగా ఉంది. ప్రత్యేకించి, మనది ప్రజాస్వామిక దేశమనీ పాకిస్తాన్ ఇప్పటికింకా ప్రజాస్వామ్యాన్ని స్థిరంగా నిలబెట్టుకోలేకపోతున్న మతరాజ్యమనీ పాశ్చాత్యుల ఎదుట వాదించి మన 'ఇమేజ్'ను సాపేక్షంగా పెంచుకోవడం మన పాలకులకొక ముఖ్య కార్యక్రమంగా ఉంది. నవాజ్‌షరీఫ్ ప్రభుత్వాన్ని పర్వేజ్ ముషర్రాఫ్ బర్తరఫ్ చేసి సైనికపాలన నెలకొల్పడం ఈ ప్రచారానికి పనికొచ్చింది. మనవాళ్లు నిర్లజ్జగా దానిని వాడుకుంటున్నారు. దర్బన్‌లో వాజ్‌పేయి వ్యక్తపరిచిన ఉత్సాహానికి అర్థం ఇదే తప్ప పాకిస్తానీలకు ప్రజాస్వామ్యం లేకపోవడం వల్ల ఏదో నష్టం జరిగిపోయిందన్న ఆవేదన కాదు. కామన్‌వెల్త్ పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఒక తేదీ నిర్ణయించాలని మనవాళ్లు చేసిన వాదనకు అర్థం అక్కడ ప్రజాస్వామ్య పురుద్ధరణ జరిగి ప్రజలు స్వేచ్ఛావాయువులు త్వరగా పీల్చుకోవాలని ఆరాటపడుతున్నారని కాదు. పాకిస్తానీ ప్రజలమీద మన పాలకులకు, మనదేశ ప్రజల మీద పాకిస్తానీ పాలకులకు అంతప్రేమ ఉండి ఉంటే ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు ఈ స్థితికి వచ్చి ఉండేవికావు. కామన్‌వెల్త్ నిర్ణయించిన గడువులోపల పాకిస్తాన్ సైనికపాలకులు ఎన్నికలు జరపలేక మరొక్కసారి ప్రపంచ



దేశాల ముందు అనాగరికులుగానూ కాశ్మీర్ ప్రజలకు భారత్‌చేతిలో అన్యాయం జరిగిందని మాట్లాడే అర్హతలేని వారిగానూ కనిపించాలి. లేదా ఆ గడువుకు గౌరవించాలనే ఒత్తిడిలో మరిన్ని సమస్యలు కొనితెచ్చుకొని ప్రపంచదేశాల ముందు నవ్వులపాలు కావాలి. వాజ్‌పేయి ప్రభుత్వానికి కావలసిందిదే. ఈ వాస్తవం దర్బన్‌లో సమావేశమయిన కామన్‌వెల్త్ దేశాల పాలకులకు అర్థం అయి ఉండదనుకోవడం పొరబాటు. బాగానే అర్థం అయి ఉంటుంది. వాళ్ల ఇళ్లలో మన నైతిక స్థాయి అందుకనుగుణంగా దిగజారి ఉంటుంది కూడా.

మనకున్నపాటి ప్రజాస్వామ్యమైనా పాకిస్తాన్‌లో స్థిరపడకపోవడం దురదృష్టకరమే. ఎంత చెడ్డా సైనికపాలన కంటే ప్రజాస్వామ్యం మేలని ఇప్పుడందరూ అంటున్న మాటలతో విభేదమేమీలేదు. పర్వేజ్ ముషర్రాఫ్ ఎటువంటివాడో ఇప్పటికింకా మనకు తెలియదుగానీ నవాజ్‌షరీఫ్ గురించి బాగానే తెలిసింది. అతని వ్యక్తిత్వంలోనూ నడవడికలోనూ ప్రజాతంత్రవాదులు మెచ్చుకోదగ్గ లక్షణాలేవీలేవు. అతను సగటు భారతదేశ రాజకీయ నాయకుడివంటి వాడని ఒక్కవాక్యంలో చెప్పుకుంటే సరిపోతుంది. అతను సుప్రీంకోర్టుపై నుండి పత్రికా రంగం దాకా అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలతోనూ చెలగాటమాడిన వైనం అందరికీ ఆందోళన కలిగించింది. అయినప్పటికీ అతని పాలన అంతం కావలసింది ఎన్నికల ద్వారానే తప్ప సైనిక పెత్తనం ద్వారా కాదు. ఎందుకంటే ఈ సైనిక పాలన ఆ మాత్రం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలనూ ప్రజల హక్కులనూ గౌరవించదు. దానిని తొలగించే మార్గమేదీ ప్రజల దగ్గరలేదు.

పాకిస్తానీ ప్రజల నిజమైన దురదృష్టమేమిటంటే ఎన్నికైన ప్రభుత్వాలు భరించలేనంతగా దిగజారినప్పుడు పరిస్థితిని చక్కదిద్దే ఒక పెద్దమనిషిగా సైన్యానికి ఒక పాత్ర ఉందన్న అభిప్రాయానికి పాకిస్తానీ రాజ్యాంగంలో చోటు ఉండడమేకాక, సమాజంలోను చాలా ప్రాచుర్యం ఉండడం. మన దగ్గరకూడా ఈ రకమైన అభిప్రాయం తరచు వినబడుతూనే ఉంటుంది. 'ఈ దేశానికి మిలటరీ ప్రభుత్వమే సరయింది' అన్న అభిప్రాయం రాజకీయ చర్చలలో వ్యక్తమవుతుంటుంది. అదృష్టవశాత్తు అది వాస్తవరూపం తీసుకునే పరిస్థితులు ఇప్పటిదాకా దేశంలో లేవు. మనదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం తిరుగులేనంత బలంగా నిలబడిపోయిందని అనలేముగానీ, దిగజారిన రాజకీయాలకు ప్రత్యామ్నాయాన్ని ప్రజాస్వామ్యంలోనే వెతుక్కునే ఆలోచనారీతే బలంగా ఉందని చెప్పుకోవచ్చు.

పాకిస్తాన్‌లో ఈ మేరకు ప్రజాస్వామ్యమొక అలవాటుగా మారకపోవడం విచారకరమే. ఆ దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరకాలంటే ప్రజాస్వామ్యం బలపడడం అవసరం. ఆ లేమిని భారత రాజ్యం ప్రయోజనాలకోసం పాకిస్తాన్ 'ఇమేజ్'ను దెబ్బతీయడానికి వాడుకునే వైఖరి విడిచిపెట్టి, దానిని మనతోటి వారయిన పాకిస్తానీల సమస్యగా అర్థం చేసుకుని ఆ దేశంలో ప్రజాస్వామ్యం మెరుగుపడడానికి మనమేదైనా కృషి చేయగలిగితే చేద్దాం.

ఇదే మన లక్ష్యమైతే కామన్‌వెల్త్ నుండి పాకిస్తాన్‌ను సస్పెండ్ చేయాలనిగానీ, పాకిస్తానీ సైనిక పాలకులను ఇబ్బంది పెట్టే రీతిలో ఎన్నికలకు కామన్‌వెల్త్ గడువు పెట్టాలనిగానీ దర్బన్‌లో పట్టుబట్టి ఉండము. దానిని పాకిస్తానీ ప్రజలు తమ మేలుకోసం చేసిన అల్లరిగా భావించరు. ముషర్రాఫ్‌ను వ్యతిరేకించే వారు సైతం దానిని తమ ఆత్మగౌరవంమీద దెబ్బగా భావిస్తారు. ఆత్మగౌరవం దెబ్బతిన్న ప్రజలు సైనిక నియంతలనే మరింత ఆదరిస్తారు. వారు యుద్ధప్రతిభను ప్రదర్శించి దేశం కోల్పోయిన గౌరవాన్ని తిరిగి సంపాదిస్తారని ఆశిస్తారు.

యుగొస్లావియా నియంత మిలోసెవిచ్ విషయంలో ఇదే జరిగింది. అతనంటే ఇష్టంలేని వారు ఆ దేశంలో చాలామంది ఉన్నారు. అయితే అతనిని ఈ ప్రపంచంలోని ఏకైక దుర్మార్గుడిగా ప్రకటించి (అతను చాలా దుర్మార్గుడనడంలో సందేహమేమీలేదు) పాశ్చాత్య దేశాలు అమెరికా నాయకత్వంలో ఒక్కటై అన్ని అంతర్జాతీయ నియమాలకూ విరుద్ధంగా యుగొస్లావియాపైన యుద్ధం ప్రకటించినప్పుడు మిలోసెవిచ్‌ను వ్యతిరేకించే యుగస్లావ్ ప్రజలు దానిని తమకు సహాయంచేసే చర్యగా భావించలేదు. యుగొస్లావియాపైన దాడిగా భావించారు. మిలోసెవిచ్‌తో తమకున్న విభేదాలు మరిచిపోయి అతని వెనుక సమీకృతమయ్యారు. యుగొస్లావియాలో మిలోసెవిచ్ నియంతృత్వం పోయి ప్రజాస్వామ్యం నెలకొనే రోజు దగ్గరపడలేదు సరికదా, మరికొంత దూరమయింది.

ఇది పాశ్చాత్య పాలకులకు పెద్దగా బాధ కలిగించలేదు. యుగొస్లావియాలో ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించడం వారి లక్ష్యంకాదు. వారు యుగొస్లావియా వంటి 'స్లావ్' దేశాలను పాశ్చాత్య దేశాలుగా కాక ప్రాచ్యదేశాలుగా చూస్తారు. ప్రాచ్యదేశాలు ప్రజాస్వామ్యానికీ ఆధునిక నాగరికతకూ పనికి రావన్నది వారి అభిప్రాయం. వాళ్లు యుగొస్లావియా పట్ల తమ ఎత్తుగడలు రూపొందించుకున్నది ఆ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్న లక్ష్యంతో కాదు. ప్రజాస్వామ్యానికి కావలసిన అర్హతలు లేని అనాగరికులన్న తిరస్కారం యుగొస్లావియావాసుల పట్ల వారికుందన్న విషయం మొన్నటి దాడులలో స్పష్టమయింది. యుగొస్లావియా లోపల మిలోసెవిచ్‌ను వ్యతిరేకించే వారికీ ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారికీ బలం కల్పించే వైఖరి కాదు. వాళ్లను మరింత బలహీనులను చేసే వైఖరి. అయినప్పటికీ యుగొస్లావియా పైన దాడులు ప్రజాస్వామ్య రక్షణ కోసం జరిగాయని చాలామంది అనగలుగుతున్నారు, నమ్మగలుగుతున్నారంటే ప్రపంచ ప్రసార సాధనాలన్నీ ఒక్క గొంతుతో చేసే ప్రచారానికి ఎంత బలముంటుందో అర్థమవుతుంది.

పాకిస్తాన్ పట్ల మన పాలకుల వైఖరి కూడా అదే. ముషర్రాఫ్ పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాడని కాదు, పాకిస్తానీయులకు ప్రజాస్వామ్యం సాధ్యం కాదని మనవాళ్ల అభిప్రాయం. ఆ విషయాన్ని మరొక్కసారి 'రుజువు' చేయడం మాత్రమే ముషర్రాఫ్ చేసింది. ఆ సంగతి ప్రపంచం గ్రహించిందో లేదోనని దానిగురించి లేనిపోని అల్లరిచేసి ప్రపంచం దృష్టిలో పాకిస్తానీ పరిణామాలు నిలిచేటట్టు చూడడం కోసమే వాజ్‌పేయి దర్బన్‌లో అంత గొడవ చేశారు. పాకిస్తానీ ప్రజలంటారా? 'మీకు ప్రజాస్వామ్యం సాధ్యం కాదు' అని వారిని చెంపదెబ్బ కొట్టడం మన పాలకుల లక్ష్యం. అంతేతప్ప వారికి నిజంగా బలం కల్పించి ప్రజాస్వామ్య పునరుద్ధరణకు సహాయం చేయడంకాదు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పాకిస్తాన్‌కు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోవడం చేతకాదనీ, మనకు మాత్రమే సాధ్యమనీ వారిని హీనంగా చూసే మన పాలకులకు నిజానికి ప్రజాస్వామ్యమంటే ఏమంత గౌరవం ఉందన్న దాఖలాలు లేవు. అవకాశం లేకగానీ గడచిన ఏడెనిమిది సంవత్సరాల అస్థిరతలో తాము ముషర్రాఫ్‌లు కావాలని వీళ్లలో ఉవ్విళ్లూరిన వారెందరో!